



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఫిబ్రవరి 21 2025 | సంపుటి :0 | సంచిక : 130 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా ప్రమాణం



- ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- ఎన్డీ పక్షాన పలువురు సిఎంలు, డిప్యూటి సిఎంలు హాజరు
- ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్

న్యూఢిల్లీ,దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

పేజి 2లో

# రాజలింగమూర్తి హత్యపై తెలంగాణ సీఎంవో ఆరా

- మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై కేసు వేసిన రాజలింగమూర్తి హత్యపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు వివరాలు సేకరించారు.
- రాజలింగమూర్తి తన స్వగ్రామం జంగేడు శివారులోని పక్కీరుగడ్డలో శుభకార్యానికి వెళ్లి భూపాలపల్లికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా దాడి జరిగింది.
- తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయం ఎదురుగా నలుగురు నుంచి ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు మంకీ క్యాప్‌లు ధరించి ఆయన్ను చుట్టుముట్టి కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు.
- దాడి అనంతరం స్థానికులు రాజలింగమూర్తిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
- ఆసుపత్రిలో చికిత్స పొందేలోపే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి (47) హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. ఈ హత్యకు గల కారణాలపై నిఘా వర్గాల నుంచి సమాచారం కోరింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎంవో అధికారులు వివరాలు సేకరించారు.

మేడిగడ్డ కుంగుబాటుపై కేసు వేసిన వ్యక్తి దారుణ హత్య

రాజలింగమూర్తి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం తన స్వగ్రామం జంగేడు శివారు పక్కీరుగడ్డలో సోదరుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి రాజలింగమూర్తి వెళ్లారు. ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి తిరిగి వస్తుండగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయం ఎదురుగా నలుగురు నుంచి ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు మంకీ క్యాపులు ధరించి ఆయన్ను చుట్టుముట్టారు. ఒక్కసారిగా కత్తులు, గొడ్డళ్లతో నరికారు. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## ఏఐజీ హాస్పిటల్‌కు కేసీఆర్.. సాధారణ పరీక్షల కోసమే!

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానకు వెళ్లారు. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం హాస్పిటల్‌కు చేరుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. వైద్య పరీక్షల అనంతరం ఆయన తిరిగి ఇంటికి చేరుకోనున్నారు.

2 లో

## జడ్జిలపై విచారణ ఉత్తర్వులు ఆందోళనకరం: లోక్‌పాల్‌కు సుప్రీంకోర్టు నోటీసులు



2 లో

## పర్సనల్ అసిస్టెంట్ కూతురు పెళ్లికి.. ఫ్యామిలీతో అటెండ్ అయిన సీఎం రేవంత్ రెడ్డి



2 లో

## హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు : మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణా రెడ్డి




హైదరాబాద్ : హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు.. బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు అని మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గండ్రా వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడారు.

భూపాలపల్లిలో రాజలింగ మూర్తి హత్యను బీఆర్ఎస్ మాజీ శాసన సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నాం. హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతోంది. ఈ హత్యను బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీశ్‌రావుకు ఆపాదించాలని కాంగ్రెస్ శతవిధాల ప్రయత్నించడం దుర్మార్గం. స్థానిక భూవివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య నాపై ఆరోపణలు చేస్తున్నారు అని వెంకట రమణారెడ్డి తెలిపారు.

ఈ హత్యపై సీబీఐ, సీఐడీ విచారణను కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఎలాంటి విచారణ చేసుకున్నా మాకు అభ్యంతరం లేదు. పేజి 2లో

## కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి.. ఏపీ జలదోపిడీని అడ్డుకోవాలి : హరీశ్‌రావు

హైదరాబాద్ :రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే%Ѿ% కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పేజి 2లో



- ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు
- కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి
- రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం
- ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు
- తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

## జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి సహకరించారు: మంత్రి ఉత్తమ్



2 లో

- ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.

## కేసీఆర్ నుంచి ప్రాణభయముంటే ప్రభుత్వాన్ని సంప్రదించాలి

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి హత్యకు గురైన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.



2లో

# సంపాదకీయం

## కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలూ!

ఈమధ్య, 'కృత్రిమ మేధ'ని ఆకాశానికి ఎత్తేస్తూ పత్రికల్లో వ్యాసాలూ సంపాదకీయాలూ వస్తున్నాయి. దాన్ని 'శ్రేయో మేధ' అనీ, 'మేధో విప్లవం' అనీ, ఇంకేదో అనీ, చెపుతున్నారు. 'కృత్రిమ మేధ' గురించి నాకు పెద్దగా తెలియదు. అందుకని, కంప్యూటర్ రంగంలో దాదాపు 40ఏళ్ళ అనుభవం వున్నవాడు, అమెరికాలో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసిన జె.ప్రసాద్‌తో మాట్లాడితే, కొంచెం అర్థం అయింది. అయితే, నేను ఈ వ్యాసంలో రాయదలుచుకున్నది, ఆ సైన్స్ గురించి కాదు. నిజానికి ఏ సైన్సు అయినా, ప్రస్తుత సమాజంలో, ఏ వర్గ ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందో చెప్పాలని మాత్రమే!

'కృత్రిమ మేధ' అనేది, మనుషులు కొన్ని పనులు జరగడం కోసం రాసుకునే ఒక కంప్యూటర్ ప్రోగ్రాం– అట! ఇంకా, సరిగా చెప్పాలంటే, 'మనుషులు రాసుకునే' అనే బదులు, 'పెట్టుబడిదారీ యజమానులు రాయించుకునే' అంటేనే బాగా సరిపోతుంది! మొత్తానికి, 'కృత్రిమ మేధ' అంటే, ఒక 'కంప్యూటర్ మీద పని చేసే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం' అనుకోవచ్చు. ఈ ప్రోగ్రాం, మానవ భాషనూ, వ్యక్తీకరణనూ అర్థం చేసుకుంటూ, అనేక రంగాలకు సంబంధించిన, ఎంతో విస్తారమైన సమాచారాన్ని పోగుచేసి, అనేక విషయాలను, అనేక కోణాల్లో వివరంగా విశ్లేషించి చెపుతుందట! 'కృత్రిమ మేధ' కూడా మానవులు తమ 'ఉత్పత్తి శక్తులు పెరగడం కోసం' తయారు చేసుకున్న ఒక సాధనమే! 'ఉత్పత్తి శక్తులు పెరగడం' అంటే మెరుగైన ఉత్పత్తి సాధనాలను చేతిలోకి తీసుకుని పనిచేసే శ్రామికులు (ఇక్కడ 'సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు') తక్కువ మంది, తక్కువ సమయంలో, ఎక్కువ పనిని, ఎక్కువ సామర్థ్యంతో చేయడం. అంతే! (వారికి పని గంటలు తగ్గేదేమీ వుండదు సుమా!)

ఈ 'కృత్రిమ మేధ' చేయగలిగే పనులు ఇన్నిన్ని కావట! ఎన్నెన్నోనట! వాటిల్లో కొన్ని మాత్రమే చూద్దాం ఇక్కడ: (1) ఏ రంగానికి సంబంధించినదైనా, అనంతమైన సమాచారాన్ని, అతితక్కువ సమయంలో, వేగంగా, ఎక్కువ ఖచ్చితత్వంతో, అనేక కోణాల్లో విశ్లేషిస్తుందట! (2) రోగ నిర్ధారణను పొరపాట్లు లేకుండా చేసి, చికిత్సా విధానాలను కూడా సూచిస్తుందట!

(3) రక రకాల రచనలనూ, అనువాదాలనూ, అతి తక్కువ సమయంలో, వేగంగా, అతి తక్కువ దిద్దుబాట్లు మాత్రమే అవసరమయ్యే విధంగా, చేస్తుందట! (4) వాతావరణంలో మామూలు ఊహకు అందని ఏ మార్పులు రావచ్చునో, వాటిని ఏ విధంగా ఎదుర్కోవచ్చునో, ఖచ్చితమైన అంచనా వేసి చెపుతుందట.

(5) స్కూలు పిల్లలకి హోమ్‌వర్కులు చేసి పెడుతుందట! లెక్కలు కూడా చేసి పెడుతుందట! అనేక భాషల్లో ఏ విషయం మీదైనా సరే వ్యాసాలు రాసి పెడుతుందట. (6) సాఫ్ట్‌వేర్ విద్యార్థులకు కొత్త ప్రోగ్రాములు రాసి పెడుతుందట. (7) ఒక కొత్త ప్రోగ్రాముని, ఎవరన్నా తయారు చేస్తే, దాన్ని పరిశీలించి, దాన్ని 'కృత్రిమ మేధ' రాసిందో, మనుషులు రాశారో, తేల్చి చెబుతుందట. (8) కావలిసిన విధంగా, అన్నిరకాల సినిమాలకీ%–% సాంఘికాలకీ, జానపదాలకీ, పౌరాణికాలకీ%–%కథల్నీ, సన్నివేశాల్నీ, సంభాషణల్నీ, పాటల్నీ, సంగీతాన్నీ, దృశ్యాల్నీ... ఇలా ఏ రకం సినిమా తీయదలుచుకున్నారో, ఆ రకంగా చేసిపెడుతుందట! (9) మరమనుషులతోనూ (రోబోట్స్‌తో), మానవరహిత వాహనాలతోనూ (డ్రోన్స్‌తో) రకరకాల వ్యాపారాల శాఖలలో, అతి తక్కువమంది ఉద్యోగులతో పనిచేయిస్తుందట. (10) నేలమీదే కాదు, అంతరిక్షంలో కూడా పరిశోధనల్ని తేలిగ్గా చేసిపెడుతుందట! %–% ఇలా, ఒకటేమిటి, ఇందుగలదందు లేదని, సందేహము వలదు! ఎందెందు వెతికి చూసిన అందందే, "కృత్రిమ మేధ"ని ఉపయోగించి, కంపెనీలు, ఎన్నో లాభాలు గడించవచ్చునట!

కొంతమంది పెట్టుబడిదారులు, ఒక 'కృత్రిమ మేధ' కంపెనీ మొదలుపెట్టి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లని జీతాలకి పెట్టుకుని, కొత్త కొత్త సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాములు రాయిస్తారు. ఆ ప్రోగ్రాములు అనేక రకాలుగా వుంటాయి. ఆస్పత్రులకూ, సైన్సు పరిశోధనలకూ కావలిసినవి ఒక రకం! బ్యాంకులకు కావలిసినవి ఇంకో రకం! పెద్ద పెద్ద యంత్రాలతో నడిచే పరిశ్రమలకి మరో రకం! అంతరిక్ష పరిశోధనలకు ఇంకో రకం ప్రోగ్రాములు! సినిమాలకు అన్నిటినీ మించిన రకం! %–% ఇలా, 'కృత్రిమ మేధ' అనే సైన్సుతో, రకరకాల ప్రోగ్రాముల్ని తయారు చేయించే కంపెనీలు ప్రపంచంలో దాదాపు 70 వేల దాకా వున్నాయని ఒక లెక్క! ఈ కంపెనీల్లో తయారయ్యే ప్రోగ్రాములన్నీ అమ్మకం కోసం తయారైన సరుకులే! కాకపోతే, అవి సబ్బుల్లాగో, చెప్పులూ, చొక్కాలూ లాగో, వస్తువులుగా వుండవు.

తేలిగ్గా అర్థం చేసుకోవడానికి, 'కృత్రిమ మేధ' అనేదాన్ని, పోలిక కోసం, ఒక పనిముట్టుగా, ఒక యంత్రంగా చెప్పుకోవచ్చు. కాకపోతే, అది ఒక కదిలే యంత్రంలా వుండదు. దాన్ని చేత్తో ముట్టుకోలేము. అది యంత్రాలకి నేర్పడానికి కొన్ని సూత్రాల, సూచనల రూపంలో ('సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం'గా) వుంటుంది. దానిని ఉపయోగిస్తూ, కొత్తగా శ్రమలు జరుగుతాయి. దాన్ని సరిగా వాడుకుంటే, దాని ఉపయోగాలు దానికుంటాయి. తక్కువ సమయంలో, తక్కువమంది మేధా శ్రామికులతో, ఎక్కువ పని జరగడానికి ఉపయోగపడుతుంది. ఈ కొత్త టెక్నాలజీ, పెట్టుబడిదారీ యజమానుల చేతుల్లో ఆస్తిగా ఉంటుంది కాబట్టి, దీన్ని 'పెట్టుబడిదారీ మేధ' అని అంటే ఎక్కువ సరిగా వుంటుంది! ఎక్కువ లాభాల్ని తెచ్చిపెట్టేదిగా వుంటుంది కాబట్టే, ఈ రంగంలో పెట్టుబడులు క్రమంగా పెరిగిపోతున్నట్టు వార్తలొస్తున్నాయి. 2025లో, ఈ రంగంలో పెట్టుబడులు దాదాపు 16 లక్షల కోట్ల రూపాయలు అవుతాయట!

ఏ కంపెనీలో పెట్టుబడి అయినా, రెండు భాగాలుగా వుంటుంది గదా? (1) సాధనాల కోసం పెట్టే డబ్బు. 'కృత్రిమ మేధ' కంపెనీలలో, ఉత్పత్తి సాధనాలుగా వుండేవి కంప్యూటర్లూ, లాప్‌టాప్‌లూ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులూ, వగైరా. ఇవి ఎంత సామర్థ్యంగలవిగా వుండాలీ అనేది, తయారు చేయవలిసిన ప్రోగ్రాముల్ని బట్టి వుంటుంది. మామూలు కంప్యూటర్లూ, లాప్‌టాపులూ సరిపోతాయాబీ లేకపోతే, సూపర్ స్పీడ్ కంప్యూటర్లు కావాలా అనేది వ్యాపార స్థాయిని బట్టీ, ఆ ప్రోగ్రాముల్ని బట్టీ వుంటుంది. (2) ఆ సాధనాలను ఉపయోగించి, రకరకాల, కొత్త కొత్త ప్రోగ్రాములు తయారు చేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకి ఇచ్చే జీతాలు. ఈ జీతాలు, సాధారణంగా, ఇతర రంగాల్లో పనిచేసే ఉద్యోగుల జీతాలకంటే, బాగా ఎక్కువగా వుంటాయి. ఎందుకంటే, వీళ్ళు తయారు చేసే ప్రోగ్రాముల్ని వాడే పరిశ్రమల్లోగానీ, ఇతర పని స్తలాల్లో గానీ, ఎక్కువమంది ఉద్యోగులు అవసరం లేకుండానే పని జరిగేలా, 'కృత్రిమ మేధ'తో తయారైన ప్రోగ్రాములు తయారు చేస్తారు కాబట్టి! %–% అంటే, 'కృత్రిమ మేధ' అనే కొత్త టెక్నాలజీ ఏయే పని స్తలాల్లోకి వస్తుందో, ఆ పని స్తలాల్లో పనులు చేస్తూవున్న అనేక మందికి ఉద్యోగాలు పోతాయి. దీనికి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే పరిష్కారం ఏమిటంటే: అక్కడ పనులు పోయినా, 'కృత్రిమ మేధ' కంపెనీల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయి –అని! కానీ, నిజమైన లెక్కలూ, అంచనాలూ వేరేగా వుంటున్నాయి. 'కృత్రిమ మేధ'కి సంబంధించిన వెబ్‌సైట్ల సర్వేల ప్రకారం, 'కృత్రిమ మేధ'కి సంబంధించిన టెక్నాలజీ వాడడం వల్ల, కొద్దికాలంలోనే, ప్రపంచవ్యాప్తంగా, 30కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయనీ, కేవలం 9 కోట్ల, 70 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వస్తాయనీ తేలింది! అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వంకర వాదనలు చేస్తూనే వున్నారు.కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా, ఈ రకం మాటలు, ఈ నాడే కాదు, 150 ఏళ్ళ కిందట కూడా వుండేవని, మార్క్సు 'కాపిటల్' ద్వారా ఇలా తెలుస్తుంది: "కార్మికులను పనినించీ తొలగించే యంత్రాలన్నీ, అదే తరహా కార్మికులను పనిలో నియమించడానికి తగినంత పెట్టుబడిని, అదే సమయంలో, తప్పనిసరిగా విడుదల చేస్తాయని జేమ్స్ మిల్, మాక్ కులోచ్, టోరెన్స్ సీనియర్, జాన్ స్టువర్ట్ మిల్, ఇంకా మొత్తం వరసగా బూర్జువా రాజకీయ అర్థశాస్త్రగ్న్యులు నొక్కి చెపుతున్నారు...(కానీ) యంత్రాల్లో వచ్చే ప్రతీ మెరుగుదలతోటీ, అది (ఆ పెట్టుబడి) పనిలో నియమించే వారి సంఖ్య తగ్గుతూనే వుంటుంది." ('యంత్రాలూ, ఆధునిక పరిశ్రమలూ' అనే చాప్టర్‌లో.) తేడా అల్లా, మార్క్సు కాలమేమో, ప్రధానంగా భారీ యంత్రాల కాలం. ఇప్పుడేమో, భారీగా వున్న యంత్రాల సామర్థ్యాన్ని మరింత భారీగా మెరుగుపరిచే 'పెట్టుబడిదారీ మేధ' కాలం!చివరిగా, ఎవరైనా అనవచ్చును: "ఎన్నో గొప్ప ఉపయోగాల్ని ఇచ్చే 'కృత్రిమ మేధ' వంటి టెక్నాలజీని వ్యతిరేకించాలా? గత 200 ఏళ్ళల్లో ఎన్నో రకాల టెక్నాలజీలు రాలేదా? వాటిని ఉపయోగిస్తూనే వున్నాం గదా? కొత్త టెక్నాలజీని వదిలేస్తూ, వెనక్కి, వెనక్కి, గుహల్లో జీవించే కాలానికే తిరిగి పోదామా?" దానికి జవాబు: మంచి టెక్నాలజీని వద్దనడం లేదు. అది సమాజంలో, మానవులందరికీ మంచిదై వుండాలి! దానిని పెట్టుబడిదారీ పద్ధతుల్లో వాడడం వల్ల, శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి.

# కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి..
## ఏపీ జలదోపిడీని అడ్డుకోవాలి : హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

### తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది ఇప్పటికైనా కళ్లు తెరవాలి..

నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు.

### నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం..

యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు ఏసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, ఢిల్లీలో ధర్నా చేద్దాం%ో% మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### నీటిని తరలించుకుపోతుంటే శిలావిగ్రహాల్లా చూస్తున్నారు..

బీఆర్ఎస్ ప్రభుత్వం లేనందువల్ల, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉన్నందువల్ల నీటిని తరలించుకునేందుకు చంద్రబాబుకు సులువు అయింది. ఇష్టం వచ్చినట్లు జలదోపిడీ జరుగుతోంది, ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి పరోక్షంగా సహకరిస్తున్నారు. ఈ ఏడాది ఇవాల్టి వరకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదు. కృష్ణా బోర్డు కేంద్రం నియంత్రణలో ఉందా ఏపీ నియంత్రణలో ఉందా అన్న అనుమానం కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. నీటిని తరలించుకుపోతుంటే శిలావిగ్రహాల్లా చూస్తున్నారు. అవసరమైతే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఉండి ఏం లాభం? కేంద్ర మంత్రిగా ఉండి నీళ్ళు తెస్తారా చంద్రబాబుకు వత్తాసు పలుకుతారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### గురు దక్షిణ చెల్లించుకుంటున్నారేమో?

ప్రధాని, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఇంటి ముందు ధర్నా చేద్దాం. రాష్ట్రం కోసం ఉపయోగపడని పదవులు ఎందుకు? సందర్భాన్ని బట్టి స్పందించాలి. నాగార్జున సాగర్ నుంచి సీఆర్పీఎఫ్ బలగాలు ఉపసంహరించాలి, లేదంటే శ్రీశైలంలో కూడా పెట్టాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చేత కావడం లేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా చూడాలి. ప్రాజెక్టులకు అనుమతులు తేవడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. 15 నెలలు అయినా ప్రాజెక్టులకు అనుమతులు తేవాల్సింది డీపీఆర్‌లు వెనక్కు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మేడిగడ్డను పండబెట్టారు, ఆర్నెళ్లలో మరమ్మత్తులు పూర్తి చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు. ఏపీ యథేచ్ఛగా నీరు తీసుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రాన్ని కోరడం కాదు ఇప్పుడు పోతున్న నీటి గురించి మాట్లాడాలి, కేంద్ర మంత్రి ఇంటి ముందు ధర్నా చేస్తే బాగుంటుంది. కేసీఆర్ ప్రతినిత్యం సమీక్ష చేసేవారు ఇప్పుడు సీఎం, మంత్రి కనీసం పట్టించుకోవడం లేదు. గత పాలకుల పుణ్యం కారణంగానే తెలంగాణకు 299 టీఎంసీల తాత్కాలిక కేటాయింపు జరిగింది. తెలంగాణకు 575 టీఎంసీల నీరు తెచ్చుకునేందుకు సెక్షన్ 3 దోహదపడుతుంది. కేవలం నిర్లక్ష్యం, వైఫల్యం, లొంగిపోయిన కారణంగానే నీటి దోపిడి. రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య పరోక్ష సంబంధం గురు దక్షిణ చెల్లించుకుంటున్నారేమో? రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేయాలి, మేమూ కలిసి వస్తాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# ఏఐజీ హాస్పిటల్‌కు కేసీఆర్..
## సాధారణ పరీక్షల కోసమే!

మొదటిపేజీ తరువాయి




కాగా, బుధవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి కేసీఆర్ హాజరైన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూడటానికి తెలంగాణ భవన్‌కు పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది. చాలారోజుల తర్వాత కేసీఆర్ తెలంగాణ భవన్‌కు రావడంతో ఆయన ను చూడాలని, ఆయనతో సెల్ఫీ దిగాలనే ఉత్సాహంతో యువకులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కేసీఆర్ వస్తారని షెడ్యూల్ ప్రకటించినప్పటికీ, ఉదయం 10గంటల నుంచే యువకులు గేట్ల వద్ద పడిగాపులు కాశారు.పార్టీ ఆహ్వానించిన నేతలనే లోపలికి అనుమతించగా, మిగతా వారు అక్కడే ఉండి కేసీఆర్ కోసం ఎదురుచూశారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కేసీఆర్ రావడంతో ఒక్కసారిగా బయట ఉన్నవారు తోసుకొచ్చారు. కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. వీలుపడని వారు ఆయన కారు దిగుతుండగా సెల్ఫీలు దిగారు.

# జడ్జిలపై విచారణ ఉత్తర్వులు ఆందోళనకరం:
## లోక్‌పాల్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకరమంటూ ఈసందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది.

హైకోర్టు సిట్టింగ్ అదనపు జడ్జిపై దాఖలైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారిస్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీచేసింది. ఈనేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టి.. స్టే విధించింది. అలాగే సదరు హైకోర్టు న్యాయమూర్తి పేరును బయటకు వెల్లడించొద్దని ఫిర్యాదుదారుడిని ఆదేశించింది.

## హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు : మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణా రెడ్డి

మొదటిపేజీ తరువాయి

మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారు. దాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటున్నాం. మృతుడిపై భూ వివాదాల ఆరోపణలు ఉన్నాయి.. రౌడీ షీట్ కూడా ఉంది. బీఆర్ఎస్‌పై, నాపై ఆరోపణలు చేయడం ద్వారా విచారణను ప్రభావితం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. హత్యలో అరెస్టయిన వ్యక్తుల పేర్లతో రాజలింగ మూర్తి పోలీసులకు పిర్యాదు కూడా చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి మతి భ్రమించింది. బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారు అని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు.

# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం



మొదటిపేజీ తరువాయి

రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995–96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996–97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# జగన్‌తో స్నేహంగా ఉంటూ..
## ఏపీ జలదోపిడీకి సహకరించారు: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసది అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.

"కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, డిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదు" అని ఉత్తమ్ విమర్శించారు.

# కేసీఆర్ నుంచి ప్రాణభయముంటే ప్రభుత్వాన్ని సంప్రదించాలి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి హత్యకు గురైన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన్ను క్రూరంగా చంపేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డే చంపించినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారని చెప్పారు. న్యాయపరంగా కొట్లాడాలి కానీ.. చంపేస్తారా? అని నిలదీశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు.

రాజలింగమూర్తి హత్యపై తెలంగాణ సీఎంవో ఆరా

"కేసీఆర్ , ఆయన కుటుంబం తెలంగాణను దోచుకుంది. వారి అక్రమాలను బయటపెడితే చంపేస్తారా? కేసీఆర్‌పై న్యాయపోరాటం చేస్తున్న చక్రధర్‌గౌడ్‌కు రక్షణ కల్పిస్తాం. రూ.కోట్లు పోతే సంపాదించుకోవచ్చు.. ప్రాణాలు పోతే తిరిగి వస్తాయా? కేసీఆర్ నుంచి ప్రాణభయం ఉన్నవారు ప్రభుత్వాన్ని సంప్రదించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు దోపిడీపై రాజలింగమూర్తి పోరాడారు. ఆయన హత్య ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తాం" అని కోమటిరెడ్డి చెప్పారు.

# పర్సనల్ అసిస్టెంట్ కూతురు పెళ్లికి..
## ఫ్యామిలీతో అటెండ్ అయిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ లో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడా లో బీఎంఆర్ సార్థ గార్డెన్స్ లో జరిగిన వివాహ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు ముఖ్యమంత్రి. ముఖ్యమంత్రి పర్సనల్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ముఖ్యమంత్రి దంపతులు. సీఎం రేవంత్ కూతురు, అల్లుడు కూడా ఈ వివాహానికి హాజరయ్యారు. అదే విధంగా ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, బుయ్యని మనోహర్ రెడ్డి, చిలుక మధు సుధన్ రెడ్డి సహా పలువురు నాయకులు వివాహానికి హాజరయ్యారు.

# విద్యార్థి శక్తి జాతీయ శక్తి

# నాటి ఎబివిపి నాయకురాలు నేడు ఢిల్లీ పాలకురాలు

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

నిన్న ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీమతి రేఖా గుప్త ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె ఢిల్లీకి 9వ ముఖ్యమంత్రి, 4వ మహిళా ముఖ్యమంత్రి. స్వర్గీయ శ్రీమతి సుష్మా స్వరాజ్ తరువాత బిజెపి నుండి 2వ మహిళా ముఖ్యమంత్రి.రేఖా గుప్తా హర్యానాలోని జింద్ జిల్లా, జులానాసబ్ డివిజన్ లోని నందిగఢ్ గ్రామంలో జూలై 19, 1974న జన్మించారు . ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని దౌలత్ రామ్ కళాశాల నుండి పట్టభద్రురాలైంది. 2022లో మీరట్‌లోని చౌదరి చరణ్ సింగ్ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘజియాబాద్‌లోని ఐ.ఎం.ఐ.ఆర్.సి "లా కళాశాల" నుండి ఎల్.ఎల్.బి పూర్తి చేసింది.1996 సం.లో ఎబివిపి లో చేరింది. విద్యార్థుల సమస్యల పట్ల ఆమె పోరాటాలు చూసి విద్యార్థులు ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షురాలిగా గెలిపించారు.విద్యార్థి జీవితం తర్వాత ఆమె బిజెపి ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు.దక్షిణ ఢిల్లీ మున్సిపల్




కార్పొరేషన్ లో ఆమె రెండు సార్లు కౌన్సిలర్ గా గెలిచారు.ఒక పర్యాయం బిజెపి మేయర్ అభ్యర్థిగా పోటీ చేసారు.రేఖ గుప్తా బిజెపి మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, భారతీయ జనతా పార్టీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.ఢిల్లీ అసెంబ్లీకి పోటీచేసిన రెండుసార్లు ఆమ్ ఆద్మీ పార్టీ వందనా కుమారి చేతిలో ఓడిపోయింది. మూడ సారి మొన్నటి ఎన్నికల్లో ఈసారి వందనా కుమారిని ఓడించి రేఖా గుప్త మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచింది.రేఖా గుప్త చిన్నతనం నుండి ఆర్.ఎస్.ఎస్ మహిళా విభాగం రాష్ట్రీయ స్వయం సేవికా సంఘ్ సభ్యురాలిగా పనిచేసారు.గెలుపు ఓటములతో సంబంధం లేకుండా రేఖా గుప్త నమ్మిన సిద్ధాంతం కొరకు పనిచేసింది.30 సం.ల సామాజిక రాజకీయ జీవితంలో సిద్ధాంతం పట్ల,పార్టీ పట్ల ఆమె అంకిత భావం, నిబద్ధతను గమనించిన సహచర ఎమ్మెల్యేలు, బిజెపి కేంద్ర నాయకత్వం ఆమెను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు.ఢిల్లీ ఒక మినీ భారత దేశం. మన దేశ రాజధాని, అన్ని రాష్ట్రాల ప్రజలు, ప్రపంచ దేశాల ప్రతినిధులు ఉండే ప్రదేశం.వివిధ ఆలోచనల, విభిన్న సిద్ధాంతాల, దేశ అంతర్గత శక్తుల, అంతర్జాతీయ శక్తుల కేంద్రం. దేశ భద్రతలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడవాల్సిన ఢిల్లీలో బిజెపి రాష్ట్రప్రభుత్వం ఏర్పడడం స్వాగతించాల్సిన పరిణామం.

**ఢిల్లీ జాతీయ రాజధాని ప్రదేశం. ఇంగ్లీష్ లో ఎన్.సి. టి అంటారు.**

**ఇది చట్టపరంగా ఏర్పాటు చేయబడిన ప్రదేశం**

**ఇందులో ప్రధాన విభాగాలు.**

**- జాతీయ రాజధాని ప్రదేశం (నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ) ఒక కేంద్రపాలిత ప్రాంతంగా 1956 నవంబరు 1న ఏర్పాటు చేయబడింది.**

**- దేశం నలుమూలలనుండి రాజధాని నగరానికి ప్రజలు వలస వస్తుండడంవల్ల అక్కడ జనం వత్తిడి విపరీతంగా పెరుగుతుంది. అందువలన చుట్టుప్రక్కల నగరాలను స్వతంత్రంగా అభివృద్ధి చేయాలనే అభిప్రాయంతో జాతీయ రాజధాని ప్రదేశాన్ని ఏర్పరచారు**

**- భారతదేశం రాజధాని క్రొత్త ఢిల్లీ**

**- దేశ రాజధాని ప్రాంతం బయట ఉండే ఉత్తర ఢిల్లీ,ఎర్రకోట తో పాటు దక్షిణ ఢిల్లీ ఏరియాను "ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్" గా ఏర్పరిచారు**

**సంక్లిష్ట రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రి రేఖా గుప్త కేంద్ర ప్రభుత్వంతో కలిసి దేశ ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ప్రజల కోరిక.**

## గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంతో...
## వాడవాడనా కంపు
## కొడుతున్న డ్రైనేజీ కాలువలు...

**- పోతిరెడ్డిపల్లి బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు వోల్లాల శ్రీకాంత్ గౌడ్..**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 20.**

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంతో గ్రామంలో డ్రైనేజీ కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోయి, మురికి కాలువలు వాడవాడ నా కంపు కొడుతున్నాయని, గ్రామం పారిశుధ్య లోపానికి గురవుతుందని గ్రామానికి చెందిన బిఆర్ఎస్వీ సీనియర్ నాయకులు వొల్లాల శ్రీకాంత్ గౌడ్, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అనంతరం వారు మాట్లాడుతూ... పలుమార్లు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన డ్రైనేజీ శుభ్రపరచడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో, మురికాలువలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని, మురికినీటి నిలువ వలన దోమలు, ఈగలు, క్రిమి కిటకాలు పెరిగి సీజనల్ వ్యాధుల బారినపడి గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా వెంటనే ఉన్నతాధికారులు స్పందించి స్వచ్ఛత, పరిశుభ్రతకు నిదర్శనంగా పొతిరెడ్డిపల్లి గ్రామాన్ని తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వామపక్ష దళిత నేతకు సన్మానం

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

**- దళిత హక్కుల నేత తాళ్లపెల్లి లక్ష్మణ్ ను సన్మానించిన డాక్టర్ పేట భాస్కర్**



జాతీయ దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ అధ్యక్షులు శ్రీ తాళ్లపెల్లి లక్ష్మణ్ ను తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఘనంగా సన్మానించారు.గురువారం కోరుట్ల పర్యటనలో డాక్టర్ పేట భాస్కర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన తాళ్లపెల్లి లక్ష్మణ్ పలు దళిత బహుజన ప్రజా సమస్యలపై చర్చించారు.ఈనెల 22 న జగిత్యాల లో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సుకు రావాలని భవిష్యత్తులో పలు సమస్యల పరిష్కారం లో కలిసి పనిచేద్దామని భాస్కర్ ను కోరారు. మొదటి సారి తన నివాసం కు వచ్చిన సందర్భంగా లక్ష్మణ్ ను సన్మానించినట్లు భాస్కర్ తెలిపారు. సిపిఐ పార్టీలో సీనియర్ నాయకులు గా సుదీర్ఘ అనుభవం గల నేత, దళిత ప్రజా సమస్యల సాధనలో రాష్ట్ర వ్యాప్తంగా కలిసి పని చేద్దామని కోరడాన్ని స్వాగతిస్తున్నమని డాక్టర్ పేట భాస్కర్ తెలిపారు.ఈకార్యక్రమంలో కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శి రామిల్ల రాంబాబు, రాజు, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలి.

**- ప్రతి ఓటరును ఇంటి ఇంటికి వెల్లి కలవాలి.**
**- నిరంతరం సమీక్ష కొనసాగాలి.**
**- సమన్వయంతో పని చేయండి.**
**- కో ఆర్డినేటర్ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి,హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్.**

**కరపత్రం ప్రతినిధి కమలాపూర్ పీబ్రవరి 20**

ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని,దానికి కో-ఆర్డినేటర్ లు సమిష్టిగా పని చేయాలని కోరారు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి.హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కమలాపూర్ మండలం గూడూరు లో నిర్వహించిన కో-ఆర్డినేటర్ రివ్యూ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఓటరును కలవాలని పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభించిన విధానాలు ఓటర్లోకి తీసుకెల్లాలని కోరారు.

## అగ్నివీర్ ఉచిత శిక్షణ నీ సద్వినియోగం చేసుకోండి.

**- అంతర్గాం ఎస్ ఐ బి వెంకట్:**

**కరపత్రం పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: అంతర్గాం: ఫిబ్రవరి 20**

యువతి యువకులు అగ్నివీర్ ఉచిత శిక్షణ నీ సద్వినియోగం చేసుకోవాలని అంతర్గాం ఎస్ఐ బి.వెంకట్ అన్నారు . ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అంతర్గాం ఎస్ఐ బి. వెంకట్ ఆధ్వర్యంలో యువకులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... యువతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అగ్ని వీర్ నియామకాలకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉచిత శిక్షణ ను గోదావరిఖని లోని స్థానిక జవహర్ స్టేడియం లో ఇవ్వనున్నారని, ఈ శిక్షణ పూర్తిగా



ఉచితమని,18 సంవత్సరాలనుండి 21 వయస్సు వరకు ఉన్న పురుషులు, మహిళలు అర్హులని, ఈ శిక్షణ లో ఉచిత భోజనం, ఉండడానికి వసతి సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతి,యువకులు ఈ నెల 21శుక్రవారం సాయంత్రం 5 గంటల లోపు అంతర్గాం పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అద్భుత అవకాశం యువతి యువకులు




సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలి. ప్రణవ్

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఫిబ్రవరి 20**

**- ప్రతి ఓటరును ఇంటి,ఇంటికి వెల్లి కలవాలి.**
**- నిరంతరం సమీక్ష,సమన్వయంతో పని చేయండి.**
**- కో-ఆర్డినేటర్ సమీక్ష సమావేశంలో పరకాల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్.**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని,దానికి కో-ఆర్డినేటర్ లు సమిష్టిగా,సమన్వయంతో పని చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



కోరారు.హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో ఇళ్ళందకుంట,జమ్మికుంట మండల కో-ఆర్డినేటర్ ల సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టభద్రుల హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరును నేరుగా ఇంటికి వెళ్లి కలవాలని,పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉందని,పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో నరేందర్ రెడ్డి గట్టిగా కొట్లాడతారని అన్నారు.ప్రచారం చేసే సమయంలో వారి సమస్యలు తెలుసుకోవాలని,వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాయ్ వాలా ప్రధాని అయినపుడు...
## ట్యూషన్ టీచర్ ఎమ్మెల్సీ కాకూడదా...

**- పేద కుటుంబాలకు కార్పొరేట్ విద్యను అందించిన నరేందర్ రెడ్డి...**
**- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతుగా**
**- శంకరపట్నం లో ఎన్నికల ప్రచారం...**
**- వెలుగునీడ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గణేష్....**

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 20**

చాయ్ వాలా దేశ దేశ ప్రధాని అయినప్పుడు విద్యాబోధనలు చేసిన ట్యూషన్, ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ కాకూడదని వెలుగునీడ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మోరే గణేష్ ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించారు. గురువారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి కి మద్దతుగా గణేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటా నిర్వహించారు. ఈ సందర్భంగా మోరె గణేష్, దళిత బంధు ఆత్మ గౌరవ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరపెల్లి శివప్రసాద్ మాట్లాడారు.ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ గా ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, రాష్ట్రంలో కార్పొరేట్ విద్యతో , తల్లిదండ్రులను ను ఆర్థికంగా దోచుకుంటున్న, క్రమంలో ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలను నెలకొల్పి పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆల్ ఫోర్స్ విద్యా సంస్థల ద్వారా సామాన్య నికి ,అందుబాటులో ఉంటూ, కుటుంబ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా తన విద్యా సంస్థల్లో రాయితీలను కల్పించి, కార్పొరేటు విద్యను అందించి, ఎంతోమంది విద్యార్థులను వైద్య విద్యలో, ఐఐటి కళాశాలలో చేరి నేడు అగ్రదేశాలతో పాటు, మనదేశంలో ఎంతో నైపుణ్యాన్ని అందిస్తున్న విద్యాప్రదాత కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు పట్టభద్రులు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డి గెలిస్తే తప్పేంటి అని, చాయ్ ఇవాళ దేశ ప్రధానిగా ఉన్నారని ప్రతిపక్ష పార్టీలను ప్రశ్నించారు. ట్యూషన్ టీచర్, విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి పై ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలను చేస్తున్నాయని, విద్యావంతుడు పేదలకు కార్పొరేట్ విద్యను అందించే ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిస్తే పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు, అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి బంగారు బాటలు వేస్తారని, ఈ సందర్భంగా గణేష్, శివ కుమార్ పట్టభద్రులు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకొని, నరేందర్ రెడ్డి కోసం మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో యువజన సంఘం నాయకులు, వెలుగునీడ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఫిబ్రవరి 21 2025

# ప్రజల రక్షణ కోసమే షీ టీం.



**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 20.**
ప్రజల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని షీ టీం ఇన్చార్జి ఎస్ఐ లావణ్య అన్నారు.రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో రామగిరి, బేగంపేట్ క్రాస్ రోడ్ లోని కాకతీయ స్కూల్ విద్యార్థలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది.అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని,ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని,అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.అమ్మాయి లకు ఎలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక,సురేష్ మరియు హెడ్ మాస్టర్ శ్రీధర్ మరియు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ సౌధ ఎదుట ధర్నాకు దిగిన ఆర్టిజన్స్ ఉద్యోగులు...

– అరెస్టు చేసి నాంపల్లి స్టేషన్ తరలించిన పోలీసులు..

**కరపత్రం ప్రతినిధి, హైదరాబాద్/వీణవంక, ఫిబ్రవరి 20.**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు కొన్ని సంవత్సరాలుగా సేవలందిస్తూ, వెట్టి చాకిరి చేస్తూ, తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా చేపట్టిన ధర్నాను,పోలీసుల అడ్డుకొని విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను నాంపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికులుగా సేవలు అందిస్తూ, కార్మికులందరం మా న్యాయమైన డిమాండ్ల కోసం, గురువారం విద్యుత్ సౌదా ఎదుట శాంతియుత ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి, తెలంగాణ ట్రాన్స్కో సీఎండీకి మెమొరండం ఇచ్చే ప్రయత్నంలో, పోలీసులు మా ధర్నాను అడ్డుకొని, అక్రమంగా అరెస్టు చేసి, కార్మికులందర్నీ పోలీస్ స్టేషన్ కు తరలించడం సరికాదని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి, ఆర్టిజన్ ఉద్యోగులను కన్వర్షన్ చేసి, సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలని, మా కుటుంబాలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు అరెస్ట్ చేసిన కార్మికులందరినీ నాంపల్లి సీఐ సమక్షంలో విడుదల చేయడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా టి వి ఏ సి జేఏసీ రాష్ట్ర నాయకులు ఊట్ల ప్రభుదాస్,రఘునాథరెడ్డి,దుర్గం విశ్వనాథ్, పెద్దపెల్లి జిల్లా టీవీఎసి జేఏసీ కన్వీనర్, ఆవుల మహేష్, సిరంశెట్టి సందీప్, విజయగిరి ప్రణయ్, లక్కం రమేష్, భాస్కర్ రెడ్డి, గుర్రాల శ్రీనివాస్, మహమ్మద్ యూసఫ్, బంగారాజు, మబ్బు శ్రీకాంత్, కొంకటి రవికుమార్, సాంబశివరాజ్, బూర్ల శ్రీనివాస్, నరేష్, కుమార్, రవి, విద్యుత్తు ఆర్టిజన్ రామగుండం డివిజన్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాధంలో సింగరేణి ఉద్యోగి దుర్మరణం

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 20.**
సింగరేణి సంస్థ అడ్రియాల గని లో పనిచేసే అసిస్టెంట్ ఫోర్ మెన్ ఊరకొండ రాజ్ కుమార్ (40) కల్వచర్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి కల్వచర్ల గ్రామం వద్ద గల కల్వర్టు వద్ద అదుపు తప్పి వాగులో పడి మృతి చెందారు.సంఘటన స్థలాన్ని మంథని సీఐ బొల్లంపల్లి రాజు గౌడ్,రామగిరి ఎస్సై పెట్టం చంద్రకుమార్ లు స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.మృతునికి భార్య లత ఇద్దరు కుమార్తెలు శ్రీచందన(13), రిషిత(9) ఉన్నారు.





# మహిళలు స్వయం ఉపాధి పొందాలి

## -లహరి డిజైనర్ సంధ్య

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 20.**
మహిళలు స్వయం ఉపాధి పొందాలని లహరి డిజైనర్ బోటిక్(పెద్దపల్లి) ప్రొప్రైటర్ పోలు సంధ్య అన్నారు.రామగిరి మండలం కల్వచర్ల లో ఆర్.ఎస్.కే ఆపన్న హస్తం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా శిబిరంలో శిక్షణ తీసుకున్న మహిళలకు ఎన్.ఎ.సి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. మహిళలు నైపుణ్యాన్ని సాధించి ఆయా రంగాల్లో నిలదొక్కుకోవాలన్నారు.ఎవరు ఊహించని విధంగా గొప్ప ఆలోచనతో ఎన్ని కోట్లు ఉన్నా సరే ఎవరు ధైర్యం చేయలేని విధంగా రేండ్ల శారద కుమారస్వామి దంపతులు ఆర్.ఎస్.కె ఆపన్న హస్తం అనే స్వచ్ఛంద సంస్థ నిర్మించి దాని ద్వారా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు,అన్నదానాలు,ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు ఆర్థిక





సహాయాలు,ఆలయాలకు విరాళాలు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.ఐనప్పటికీ తన గ్రామంలోని నిరుద్యోగ యువతుల కోసం,ఆడబిడ్డల కోసం వారు స్వయం ఉపాధి కల్పించుకునే విధంగా వారి కాళ్ల మీద వాళ్లు నిలబడాలని తన సొంత ఖర్చుతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి,ట్రైనర్‌కు వేతనాలు చెల్లిస్తూ శిక్షణ పూర్తయ్యి ఎన్.ఎ.సి సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందే వరకు కూడా ప్రతిరోజు భోజనం పెడుతూ,ఇంకా తన గ్రామంలోని మహిళలకు ఏదో చేయాలని పరితపిస్తున్న రేండ్ల దంపతులను ఈ సందర్భంగా అభినందించారు.కాగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో ఒకరోజు ప్రత్యేక శిక్షణ తీసుకొని పరీక్షలు నిర్వహించి మహిళలకు విలువైన సర్టిఫికెట్లు అందజేయడం ద్వారా మహిళలు తాము ఎంచుకున్న కుట్టుమిషన్ రంగంలో ఆర్థిక పరంగా రాణించడానికి అవకాశం ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో రత్నాపూర్ తాజామాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు, రాష్ట్ర బీసీ మహిళ ఉపాధ్యక్షురాలు సరోజ,ఎన్.ఎ.సి కంస్ట్రక్టర్ సబితా,లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాస్,కుట్టు మిషన్ ట్రైనర్లు శ్యామల స్వప్న,కవిత,శివ పటేల్, మహిళలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 20**
జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో కోరపల్లి అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సును బాలికల మరియు బాలురకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఎం హేమలత మరియు జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి హాజరవగా, ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎం హేమలత మాట్లాడుతూ.. నేటి బాలురే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థి దశలోనే పిల్లలు మంచి మార్గంలో నడవాలని అన్నారు. మన చుట్టూ జరుగుతున్న కొన్ని అనాయుత కార్యక్రమాలపై విద్యార్థులకు మంచి అవగాహన కల్పించాలని సూచించారు. యువత ముఖ్యంగా డ్రగ్స్ గంజాయి ఇలాంటి మాదకద్రవ్యాయలకు అలవాటు పడకుండా కాపాడుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ బాధ్యత మన అందరి పైన ఉందని, అలాంటి కార్యక్రమాలపై యువత ఎప్పుడూ ముందుండి మంచి మార్గంలో నడిపించాలని, మంచిగా చదువుకొని, మంచి పేరు తెచ్చుకోవాలని వారు






పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ సీఐ వరగంటి రవి మాట్లాడుతూ.. పట్టణంలో జరుగుతున్నటువంటి, అసాంఘిక కార్యక్రమాలలో, ముఖ్యంగా వినిపించేది, మాదక ద్రవ్యాలు డ్రగ్స్, గంజాయి లాంటివి, చాప కింద నీరు లాగా, పట్టణం నుండి పల్లెటూరికి చేరుతున్నాయని, మాట్లాడారు.ముఖ్యంగా జమ్మికుంటలో రైల్వే స్టేషన్ ఉండడంవల్ల, మహారాష్ట్ర లాంటి సిటీ నుండి జమ్మికుంటకు, గంజాయి మదకద్రవ్యాలు సులువుగా రవాణా చేసుకొని, విద్యార్థులని టార్గెట్ గా చేసుకొని, చెడు వ్యసనాలకు అలవాటు చేస్తున్నారని, అన్నారు. ముఖ్యంగా ఇలాంటి కేసులు ఎన్నో మా దృష్టికి వచ్చాయని, గంజాయి అలవాటు పడిన వ్యక్తి ఎంతటి నేరానికైనా వెనకాడబోడని, ఆ మత్తులో ఏం చేస్తున్నాడు అతనికి అర్థం కాని పరిస్థితిలో ఉంటారని వివరించారు. డ్రగ్స్ కు బానిసైతే జీవితమే నాశనం అవుతుందని, ఈ అలవాటు ఉన్న వ్యక్తి అనేక రోగాలకు గురై మరణిస్తారని, విద్యార్థులు ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ఎల్లప్పుడూ మంచి మార్గంలోనే నడవాలని సూచించారు. చదువు కన్నా గొప్పది ఏదీ లేదు అని, మంచిగా చదువుతే మనం మంచి ఉద్యోగాలు సంపాదించుకొని, గొప్ప స్థాయిలో ఉండాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వివరించారు.

# పిప్పడ్పల్లి గ్రామంలో దళితుడు చింత చెట్టుకు చింతకాయ తెంపిండని కులం పేరుతో దూషించి దాడి

- దళితుడి పై దాడి చేసిన అగ్రకుల పెత్తందారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి
- కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

**కరపత్రం సంగారెడ్డి జిల్లా ఫిబ్రవరి,20 ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్పల్లి గ్రామంలో ఎస్సి కులానికి చెందిన మామిడ్గి సుమన్ చింత చెట్టు ఎక్కి చింతకాయ తెంపిండని కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
సంగారెడ్డి లో జరిగిన (కెవిపిఎస్) కుల వివక్ష వ్యతిరేక



పోరాట సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో అతిమేల మానిక్ హాజరై మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీన పిప్పడ్పల్లి గ్రామానికి చెందిన చీకూర్తి నీలమ్మ భర్త అమృత్, మా వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింత చెట్టుకు చింతకాయ తెంపి తీసుకురావాలని చెప్పడంతో సుమన్ వెళ్లి చింత చెట్టు ఎక్కి చింతకాయలు తెంపుతుండగా చీకుర్తి లక్ష్మణ్ అతని భార్య మమత నీకు చింతకాయలు ఎవడు తెంపమన్నారని ఇష్టానుసారంగా దూషించినారు. తెంపిన చింతకాయలను అక్కడే వదిలేసి వెళ్ళిపోయినారు మరుసటి రోజు ఫిబ్రవరి 14వ తేదీన సుమన్ ఇంట్లో ఉన్నప్పుడు చీకూర్తి లక్ష్మణ్ అతని భార్య మమతా వెళ్లి గల్లపట్టి ఇంటి నుండి గుంజుకొచ్చి కులం పేరుతో అనరాని మాటలు అంటు దూషించి దాడి చేయడాని నిరసిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. పోలీస్ స్టేషన్లో పిటిషన్ ఇచ్చి ఆరు రోజులు గడిచిన ఇప్పటికి ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు చట్టం పెత్తందారులకు చుట్టంగా మారిందని అన్నారు. దళితుడు సుమన్ పై దాడి చేసిన అగ్రకుల పెత్తందారుల పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలి కేవీపీఎస్ రిమాండ్ చేస్తుందని అన్నారు, బాధితులకి న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు
ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ కెవిపిఎస్ నాయకులు రాజయ్య బాబురావు తదితరులు ఉన్నారు..

# కరీంపేట్ లో ఓపెన్ కాస్ట్ అనుకుంటున్నారా...

- పొరపడినట్లే... మట్టి మాఫియా పట్టించుకోని అధికారులు....
- రాత్రి పగలు తేడా లేకుండా కరీంపేటలో మట్టి తరలింపు...
- ఉన్నతాధికారులు స్పందించాలి గ్రామస్తుల డిమాండ్...

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 20**
కరీం పెట్ గ్రామంలో ఓపెన్ కాస్ట్ అనుకుంటున్నారా అలా అయితే పొరపడినట్లే మట్టి మాఫియా రాత్రి పగలు తేడా లేకుండా అధికారుల నిద్రమత్తులో మట్టిని తరలించి గ్రామంలోని కొత్తను ఓపెన్ కాస్ట్ తయారు చేశారని,గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. కరీంనగర్ జిల్లా



,మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో మట్టి మాఫియా ఆగడాలకు హద్దులేకుండా పోయిందని, ప్రభుత్వ ఆస్తులను కాపాడి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు మట్టి మాఫియా అందించే మామూళ్ల మత్తులో ఉండి మట్టి మాఫియాకు అండగా ఉండడంతో కరీంపేట్ గ్రామంలో రాత్రి పగలు లేకుండా జెసిబిలను పెట్టి వందలాది ట్రాక్టర్లతో కొత్త కుంటలోని మట్టిని తరలించి కోట్ల రూపాయలకు పడగలెత్తుతున్నారని, నియంత్రించాల్సిన మండల స్థాయి అధికారులు నిద్రమత్తులో, మామూళ్ల మత్తులో ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములకు చెల్లించకుండా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మట్టి మాఫియా పై ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, జెసిబి యజమానుల ఇష్టారాజ్యం అరికట్టి, మట్టి మాఫి ఆగడాలకు కళ్లెం వేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుచున్నారు. లేకుంటే గ్రామస్తులు అందరూ ఏకమై ఆందోళనలు చేస్తామని